'పీఎంజుగా'ను పకడ్బందీగా అమలుచేయాలి

జైనూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పీఎంజుగా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంజుగా కార్యక్రమంలో మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో మౌలిక సదుపాయలు కల్పించడానికి అవసరమైన నివేదిక తయారు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నగేష్, ఈవో ఆనంద్‌రావు, ఎంఈవో మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నాభావు సాటే జయంతి

జైనూర్, అగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉషేగాంలో సోమవారం అన్నాభావు సాటే జయంతిని గ్రామ ప్రజలు ఘనంగా జరపుకున్నారు. గ్రామస్థులు అన్నాభావు సాటేను చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో రెహయాన్ ఫౌండేషన్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్, మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు దత్త, మాజీ వైస్ ఎంపీపీ చీర్లలే లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి

వాంకిడి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బీపీ మండల్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ సభ్యులు అశోక్, గురుబంతే, భరద్వాజ్, జయరాం, పాండుజీ, దీపక్, చమల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలి

లింగాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రామచందర్ అన్నారు. సోమవారం అయన మండలంలోగల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్యం అందించాలన్నారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

- జూనియర్ కళాశాలల్లో వేధిస్తున్న వ్యాయామ అధ్యాపకుల కొరత
- క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు



ఆడించేవారు లేక.. ఆటలు సాగక

ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపే ఆటలకు విద్యార్థులు దూరమవుతున్నారు.. ఆసక్తి ఉన్నా ఆడించేవారులేక.. సాధన చేయలేక ఉదాసీనంగా ఉండిపోతున్నారు. ఈ పరిస్థితి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొంది. ఏళ్లుగా వ్యాయామ అధ్యాపకుల పోస్టులు భర్తీకాక విద్యార్థులు నష్టపోతున్నారు.

వాంకిడి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు తదితర అంశాల్లో ప్రతిభ చాటితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. అందుకు పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు వ్యాయామ ఉపాధ్యాయులు, ఆధ్యాపకులు ఉంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గతంలో ఆయా పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేసేందుకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. వ్యాయామ ఆధ్యాపకులను భర్తీ చేయకోవడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. గ్రామీణ ప్రాంత నిరుపేద విద్యార్థులకు చదువుతో పాటు క్రీడాస్ఫూర్తి ఎక్కువగా ఉంటుంది. జాతీయ స్థాయిలో రాణించే సత్తా ఉన్నా వ్యాయామ ఆధ్యాపకులు లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్న పరిస్థితి నెలకొంది. తొలసారిగా ఇంటర్ బోర్డు నుంచి వ్యాయామ పరికరాల కొనుగోలుకు ప్రత్యేకంగా ఒక్కో కళాశాలకు రూ. 10 వేలు నిధులు సైతం మంజూరు చేసింది.

● ఆసక్తి ఉన్నా ప్రోత్సాహం కరువు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధకులే వ్యాయామ ఆధ్యాపకులుగా వ్యవహరిస్తున్నారు. దీంతో క్రీడల్లో ప్రోత్సహం కరువై క్రమంగా విద్యార్థులకు ఆటలపై ఆసక్తి తగ్గుతోంది. రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించే వారికి క్రీడాకోటా కింద రిజర్వేషన్ వర్తింపచేస్తున్నారు. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు అవకాశాలను కోల్పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించి రాష్ట్రవ్యాప్తంగా పీడీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు.

● 11 కళాశాలల్లో ఒక్కరు లేరు....

జిల్లాలో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఫీజుల భారం భరించే స్థోమత లేని పేద విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చేరుతున్నా రు. ప్రస్తుతం జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి 4,180 మందికి పైగా వి ద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూని యర్ కళాశాలల్లో వ్యాయామ ఆధ్యాపకులు లేకపో వడంతో విద్యార్థులు క్రీడల్లో రాణించాలంటే సొంతంగా సాధన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒక్క వ్యాయామ ఆధ్యాపకుడు లేకపోవడం గమనార్హం.

● నియామకాలు లేవు...

ఇంటర్ కళాశాలల్లో పీడీ పోస్టులను ప్రభుత్వం ఏళ్లుగా భర్తీ చేయడంలేదు. గతంలో వెలువడిన ఉద్యోగ ప్రకటనలో పీడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకున్నా కొందరు కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియ ఆగిపోయింది. గతంలో పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి ఇంటర్ కళాశాలల పీడీలుగా పదోన్నతి కల్పించేవారు. ఇదికూడా పదేళ్లుగా నిలిచిపోవడంతో కళాశాలల్లో వ్యాయామ ఆధ్యాపకుల పోస్టు ఉందా లేదా అన్న సందేహాలు కలుగుతున్నాయి.

వ్యాయామ అధ్యాపకులను నియమించాలి



- దుర్గం రిషిత్- విద్యార్థి

ప్రభుత్వ కళాశాలల్లో వ్యాయామ ఆధ్యాపకులు లేక క్రీడలు ఆడలేక పోతున్నాము. ఏళ్ల తరబడి ప్రభుత్వం వ్యాయామ ఆధ్యాపకుల పోస్టులు భర్తీ చేయడంలేదు. దీంతో కళాశాలల్లో క్రీడలకు దూరమవుతున్నాము. క్రీడల్లో ప్రతిభ ఉన్న కనబర్చిలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే వ్యాయామ ఆధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలి.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాము..



- కళ్యాణి, డీఐఈవో

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ ఆధ్యాపకుల కొరత ఉంది. ఈ విషయం ప్రభుత్వ పరిగణలోఉంది. ప్రస్తుతం ఆయా కళాశాలల్లో క్రీడలపై అవగాహన ఉన్న అధ్యాపకులతోనే క్రీడలు నిర్వహిస్తున్నాము. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాము.

యూరియా సరఫరా చేయని అసమర్థ ప్రభుత్వం

-సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



కాగజ్‌నగర్‌లో రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

కాగజ్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రైతులకు యూరియా సరఫరా చేయని అసమర్థ ప్రభుత్వమని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు విమర్శించారు. సోమవారం కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట గల ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ యూరియాను రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తే సక్రమంగా యూరియాను సరఫరా చేయటం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసమర్థవంతగా వ్యవహరిస్తున్నట్టు పేర్కొన్నారు. 266 రూపాయలకు అమ్మాల్సిన యూరియా బస్తా బ్లాక్ మార్కెట్‌లో 600 రూపాయలకు అమ్ముకుంటున్నారని తెలిపారు. దీన్ని బట్టి కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్టు తెలిపారు. వెంటనే కూపన్లు ఇచ్చిన రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండు చేశారు. వ్యవసాయాధికారులు యూరియా సరఫరా చేస్తామని చెప్పిన కూడా ఎమ్మెల్యే విన్పించుకోలేదు. ఇరువైపులా వాహనాలు నిలిచి పోవటంతో పోలీసులు జోక్యం చేసుకొని ఎమ్మెల్యేను బలవంతంగా వాహనంలో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

ఆసిఫాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యాన మాట్లాడుతూ ఆశా వర్కర్లు పని చేయడం లేదని, పారితోషికాలు తగ్గించాలనే వ్యతిరేక విధానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని, పారితోషికాలు తగ్గించకుండా యధావిధిగా మొత్తంలో గతంలో చెల్లించినట్లు సకాలంలో చెల్లించాలని, కేంద్రం పెంచిన పారితోషికాల చెల్లింపు ఫిక్సడ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వరూప, బద్రుబాయి, భారతి, ఓమల, లక్ష్మి, పంచశీల, వనిత, నవీన, మొగ్రా, లక్ష్మి, శ్రీలత, పూజ, కిత, అనిత, నిర్మల, అరుణ, రేణుక, కమల, వకుల, కేసర, రాజేందర్, శ్రీనివాస్, త్రివేణి, కృష్ణమాచారి, సమ్మయ్య, శంకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఏర్పాట్లపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండపాల అనుమతి విషయంలో అధికారులు సమగ్రంగా పరిశీలించాలన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా అన్ని చర్యలు పక్కాగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజావా ణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందించే దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని జన్కాపూర్ వార్డుకు చెందిన సమీనబేగం తన ఇల్లు ఇటీవల వర్షాలకు కూలిపోయిందని నష్టపరిహారం ఇప్పించాలని దరఖాస్తు సమర్పించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరికాలనీకి చెందిన తార తాను రెబ్బెన మండలం గంగాపూర్ శివారులో కొనుగోలు చేసిన భూమికి పట్టా జారీ చేయాలని అర్జీ సమర్పించారు. కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌కు చెందిన సమిత్‌దాస్ తన కూతురుకు ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ మైనార్టీ గురుకులంలో సీటు ఇప్పించాలని కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తన చేనులో వరి, పత్తి పంటలు మునిగిపోయాయని సర్వే జరిపి నష్టపరిహారం ఇప్పించాలని కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌కు చెందిన సుమతి మండల్ అర్జీ సమర్పించారు. కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌కు చెందిన చంద్రకాంత్ మండల్ తనకు జారీ చేసిన పట్టాదాపు పాసు పుస్తకంలో పేరు తప్పుగా నమోదు అయినందున సవరించాలని కోరారు. ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన అక్షర చిట్‌ఫండ్ బాధితులు తాము అక్షర చిట్ ఫండ్‌లో జమచేసిన డిపాజిట్ డబ్బులను ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో సంబం ధిత అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో భూ భారతి దరఖాస్తుల పరిష్కారంపై సోమవారం సమీక్షించారు. అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావు, జిల్లా సర్వే ల్యాండ్ అసిస్టెంట్ డైరెక్టర్ సోమేశ్వర్, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- ఎస్పీ కాంతిలాల్ పాటిల్



ఎస్‌హెచ్‌వోలకు ఫింగర్ ప్రింట్ డివైస్‌లను అందజేస్తున్న ఎస్పీ

ఆసిఫాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాయలంలో ఏర్పాటు చేసిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ కేసు క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్ వాహనాలతో అధికారులు, సిబ్బంది నిరంతరం గస్తీ కాస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు రాబోయే గణేష్ నవరాత్రుల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్సవ కమిటీ సభ్యులకు నియమనిబంధనలను వివరించాలన్నారు. శోభాయాత్ర సమయాల్లో డీజేలు పెట్టడం నిషేధమని, లక్కీడ్రా, లాటరీల నిర్వహణకు అనుమతి లేదని తెలిపారు. అనంతరం అన్ని పోలీసు స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గంజాయి మత్తు పదార్థాలు, మట్కా జూదం, లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతీ పోలీసు స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన అన్ని ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీ రామానుజం, డీసీఆర్‌బీ డీఎస్పీ విష్ణుమూర్తి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌వోలకు ఫింగర్ ప్రింట్ డివైస్‌లు అందజేత

జిల్లాలోని పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఫింగర్ ప్రింట్ డివైస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫింగర్ ప్రింట్ డివైస్‌ల ద్వారా నేర విచారణలో నిందితుల గుర్తింపు త్వరగా సాధ్యమవుతుందని, నేర చరిత్ర కలిగిన వ్యక్తులను సులభంగా గుర్తించి చట్ట పరమైన చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. నూతన సాంకేతిక పద్ధతుల వినియోగం ద్వారా నేరాలను అరికట్టడం, శాంతిభద్రతలు కాపాడటం పోలీసు శాఖ ప్రధాన ధ్యేయమని తెలిపారు.

విన్నపాలు వినవలే..

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

కెరమెరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఝరి ఉర్దు మీడియం ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మాజీ ఎంపీపీ మోతిరాం సోమవారం ఎంఈవో ప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. పీజీహెచ్‌ఎం, ఫిజికల్‌సైన్స్, సోషల్ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రిజ్వాన్, హిలాహి, అయ్యూబ్, గులాబ్‌ఖాన్, నిసార్, అబ్దుల్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

కాలువకు మరమ్మతులు చేయండి

ఆసిఫాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వట్టివాగు ప్రాజెక్టు ప్రధాన డి-4 కుడికాలువ గండి పడి నీరు వృధాగా పోతుందని కాలువకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సోమవారం ప్రజా ఫిర్యాదు విభాగంగా సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని వెంటినే మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కార్తీక్, అశోక్, టీకానంద్, అరుణ్, మహేష్, శంకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు రోడ్లు నిర్మించండి..

ఆసిఫాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామాల రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలకు రోడ్లు సరిగ్గా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత వారం వాంకిడి మండలానికి చెందిన ఓ మహిళ సకాలంలో ఆసుపత్రికి తరలించలేని పరిస్థితుల్లో ఒక పాపకు జన్మనిచ్చి మృతి చెందిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయికుమార్, ఉపేందర్, ప్రకాష్, వెంకటేష్, అజయ్, రాకేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కమీషన్ ఇవ్వాలి..



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

ఆసిఫాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అయిదు నెలల కమీషన్ డబ్బులను వెంటనే చెల్లించాలని కోరుతూ ఆసిఫాబాద్ మండలంలోని రేషన్ డీలర్లు సోమవారం అదనపు కలెక్టర్ డేవిడ్‌కు, తహసీల్దార్ రియాజ్ అలీలకు వినతి పత్రం అందజేశారు. అయిదు నెలలుగా కమీషన్ రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే కమీషన్ డబ్బులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డీలర్లు శేషగిరిరావు, శ్రీనివాస్, ఆత్మారావు, గోపాల్, రమేష్, భాస్కర్, దరుంబాయి, చంద్రకళ, శిరీష పాల్గొన్నారు.

రెబ్బెన/చింతలమానేపల్లి: రేషన్ డీలర్లకు కమిషన్ చెల్లించాలని సోమవారం డీలర్లు రెబ్బెనతహసీల్దార్‌కు, చింతలమానేపల్లి ఆర్ఐ జాఫర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు డీలర్లు మా ట్లాడుతూ అధికారులు వెంటనే స్పందించి బకాయిలు చెల్లించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు శ్రీపతి, జానకిరాం, మురళి, శంకర్, పెంటయ్య, అశోక్‌గౌడ్, బాబురావు, రామయ్య, మస్తాన్, వెంకటేష్, సురేష్, గణేష్, రహిమాన్, స్వర్ణలత, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా అమ్మకాలు బంద్ చేయాలి

చింతలమానేపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రన్‌వెల్లి గ్రామంలో గుడుంబా అమ్మకాలు బంద్ చేయాలని కోరుతూ సోమవారం గ్రామ యువకులు చింతలమానేపల్లి పోలీసుస్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. గుడుంబా విక్రయాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గుడుంబా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో మేక మృతి

జైనూర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చిరుత దాడిలో మేక మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తపలి అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. రైతు రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే తనకు ఉన్న రెండు మేకలను పశువుల కాపరి మేతకు అప్పజెప్పాడు. పశువుల కాపరి 20 మేకలను అడవికి మేతకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం ఒక్కసారిగా చిరుత మేకపై దాడి చేసింది. దీంతో భయంతో ఇతర మేకలను తీసుకుని బయ టికి కాపరి బయటకు వచ్చి అటవీశాఖ అ ధికారులకు సమాచారం అందించాడు. ఎఫ్ ఎస్‌వో అనూషా, బీట్ అధికారి మహేశ్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మేకను చంపింది చిరుతనా లేకా పులినా అనేది వివరాలు సేకరించి తెలుపుతామని అన్నారు.

బీజేపీ నాయకుల నిరాహార దీక్ష

వాంకిడి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలో ఇందిరమ్మ ఇళ్లలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం నిరాహర దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్ మాట్లాడుతూ వాంకిడి మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల బంధువులకు, ఇందిరమ్మ కమిటీ సభ్యుల బంధువులకు ఇళ్ల మంజూరు చేశారన్నారు. వీటిపై విచారణ జరిపి అర్హులైన నిరుపేదలకు అందించాలని డిమాండ్ చేశారు. మండలంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించే వరకు రిలే నిరాహరదీక్ష చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, మారుతి, వికాస్, అక్షయ్, గణేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికే 'కర్మయోగి అభియాన్'

లింగాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల అభివృద్ధే కర్మయోగి అభియాన్ పథకం లక్ష్యమని ఎంపీడీవో రామచందర్ అన్నారు. సోమవారం లింగాపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో అదికారులతో కర్మయోగి అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మండలం మొత్తంలో తొమ్మిది రెవెన్యూ గ్రామాలను పథకం కింద ఎంపిచేశామన్నారు. ఆయా గ్రామాల్లో సెప్టెంబరు 1వ తేది నుంచి 7వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు, వైద్యం, విద్య, తాగునీరు, రవాణా, విద్యుత్ తదితర అంశాలను ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. క్యాక్రమంలో మండల పంచాయతీ అధికారి రజనీకాంత్, ఏపీఎం సూర్యకాంత్, మండల విద్యాధికారి ఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

కౌటాల: జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయిలో జరిగిన యోగా పోటీల్లో కౌటాల మండలం జేబీసీటీ యోగా ధాన్య కేంద్రంకు చెందిన బట్టి అఖిల్‌సింగ్ గోల్డ్ మెడల్, నామేవార్ నాగచైతన్య సిల్వర్ మెడల్ సాధించారు.

రెబ్బెన: సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ కమిటీ సభ్యుడిగా మారిన వెంకటేశ్వర్లు నియమించారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌తిరుపతి, చీఫ్ ప్యాట్రన్ ఆర్ నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

దహెగాం: దహెగాం మండల కేంద్రంలోని డ్రైనేజీపై ఉన్న ఆక్రమణలను పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం సిబ్బంది తొలగించారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే యూరియా కొరత

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి





ఆసిఫాబాద్‌లో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆసిఫాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమేనని ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆరోపించారు. సోమవారం పీఏసీఎస్ కార్యాలయంలో రైతుల పక్షాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డికి కనబడడం లేదా, చెవులు వినపడడం లేదా నీకు పిరపాలన చేతకాక పోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఒక్క రైతుకు యూరియా ఇబ్బంది లేకుండా పంపిణీ చేయడం జరిగిందని, 24 గంటల కరెంటు ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్సుకోల సరస్వతి, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, రవీందర్, అహ్మద్, బలరాం, నిసార్, లక్ష్మణ్, భీమేష్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, శ్రీను, రవి, కిట్టయ్య, మల్లయ్య, పెంటు, పోచన్న తదితరులు పాల్గొన్నారు.

● **తిర్యాణి/వాంకిడి/ కెరమెరి/ జైనూరు/ సిర్పూరు(యు)/ కౌటాల/ రెబ్బెన, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):** బీఆర్‌ఎస్ అదిష్ఠానం పిలుపుమేరకు జిల్లాలోని తిర్యాణి, వాంకిడి, కెరమెరి, జైనూరు, సిర్పూరు(యు), కౌటాల, రెబ్బెన మండలాల్లో బీఆర్‌ఎస్ నాయకులు యూరియా కొరతపై ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. రైతులకు యూరియా పంపిణీలో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.

● రైతులకు అన్యాయం..

కాగజ్‌నగర్: రైతులకు యూరియా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానికంగా తన నివాసంలో ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడారు. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు కేంద్రంతో మాట్లాడి యూరియాను తెప్పించాల్సి పోయి రైతుల విషయంలో నాటకాలు ఆడుతున్నారన్నారు. సిర్పూరు నుంచే తాను పోటీ చేస్తానని, ఇందుకు కేటీఆర్, కేసీఆర్‌లను ఒప్పించి బరిలో ఉండేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, కొంగ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ మినాజ్, పార్వతి, అంజన్న, వరలక్ష్మి, కమల తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు

నెన్నెల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గుడుంబాను తయరు చేసి గ్రామాల్లో విక్రయిస్తున్న చిన్నలంబాడితండాకు చెందిన పాల్త్యా వెంకానాయక్, జాటోత్ శ్రీనివాస్, పెద్దలంబాడితండాకు చెందిన ధరవత్ స్వప్నపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. వారు తండాల్లో నాటుసార తయారు చేసి ద్విచక్రవాహనాలపై గ్రామాల్లో తిరుగుతూ విక్రయిస్తారని చెప్పారు. వారి నుంచి గుండుంబాతో పాటు రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వివరించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

జైపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్వ గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నర్వ గ్రామంలోని ఒకరి నివాసంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఆ ఇంటిపై దాడిచేసి పట్టుకున్నామన్నారు. నగదు రూ. 14,100, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చింతలమానేపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాసాగర్- కొత్తగూడ గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాబాసాగర్ గ్రామానికి చెందిన పొట్టె సంతోష్, ఎలుముల వెంకటేష్ ద్విచక్రవాహనంపై ఎదురెదురుగా వస్తూ ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు.

ముగ్గురి రిమాండ్

పెంచికలపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎలుగుబంటిని హతమార్చిన కేసులో ముగ్గురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్వో అనీల్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెంచికలపేట రేంజ్ పరిధిలో గత సంవత్సరం ఎలుగుబంటిని హతమార్చారు. ఈ కేసులో ఇప్పటికే ఏ1ను రిమాండ్‌కు తరలించగా మిగితా ముగ్గురు అప్పాజీ వెంకటేష్, మడే మధునయ్య, సామెర సత్తన్నలను సోమవారం సిర్పూర్(టి) కోర్టులో జడ్జి ముందు హాజరు పరిచి ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

వరి సాగు జోరు



నంబాల శివారులో వరినాట్లు వేస్తున్న మహిళలు

చెరువులు, కుంటల కింద మొదలైన నాట్లు

మండలంలో ఆరువేల ఎకరాల్లో సాగు

రెబ్బెన, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలంలో వానాకాలం పంటల సాగు పనులు జోరందుకున్నాయి. జూన్ రెండో వారంలోనే రైతులు పత్తి విత్తనాలు వేసుకోగా ప్రస్తుతం పత్తి పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. వర్షాలు సైతం పంటకు అనుకూలంగా కురుస్తుండటంతో వానకాలం పంటల సాగు పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. పత్తిలో కలుపులు, తెగుళ్ల నివారణ చర్యలు చేపడుతూనే మరో వైపు వరిసాగుపై దృష్టి పెట్టారు. అయితే మండలంలో ఆశించిన స్థాయిలో భారీ వర్షాలు లేకపోవటంతో చెరువులు, కుంటలు నిండలేదు. అయినప్పటికీ వరుణుడిపై భరోసాతో రైతులు నార్లు పోశారు.

పదిరోజుల క్రితం కురిసిన వర్షాలకు చెరువులు, కుంటల్లో వరద నీరు వచ్చిచేరటంతో రైతులు వరినాట్లు వేసే పనుల్లో మునిగి పోయారు. కిందటేడు వానాకాలం మాదిరిగానే ఈ సారి కూడా మండలంలోని రైతులు సుమారు ఆరు వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నట్టు అధికారులు అంచనా వేశారు.

మండలంలోని వరిసాగుకు అనువైన నీటి ప్రాజెక్టులు అందుబాటులో లేకపోవటంతో రైతులు పూర్తిగా వర్షాలనే న మ్ముకొని వరిసాగు చేపడుతున్నారు. వట్టివాగుతో ప్రాజెక్టు ద్వారా మండలానికి సాగునీరు సరఫరా అవుతున్నప్పటికీ కాల్వలు, తుములు సరిగా లేని కారణంగా పూర్తి స్థాయిలో పం టలకు సాగునీరు అందటం లేదు. కేవలం వట్టివాగు కాల్వల కింద మండలంలో 12,500 ఎకరాలకుల సాగునీరు అందించాల్సి ఉండగా, తూములు నిర్వహణ లేకపోవటంతో 2,500 ఎకరాలకు మించి సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. మండల రైతులు చెరవులు, కుంటల్లో వరదనీరు వచ్చి చేరటంతో వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

ఈ నెలాఖరు వరకు పూర్తి చేసుకోవాలి..

దిలీప్ కుమార్, వ్యవసాయాధికారి, రెబ్బెన



మండలంలో బోరు బావులు, ఇతర నీటి వనరులున్న రైతులు ముంద స్తుగానే వరినాట్లు పూర్తి చేసుకున్నారు. ఇక చెరువులు, కుంటల కింద ఇప్పుడిప్పుడే వరినాట్ల ప్రక్రియ మొదలైంది. రైతులు ఈ నెలాఖరు లోగా వరినాట్లు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. చెరువులు, కుంటల కింద రైతులు తక్కువ కాల వ్యవధిలో కూడిన వరిని సాగు చేయాలి. లేకుంటే చివరి దశలో కుంటలు, చెరువుల్లో నీరు లేకుంటే ఎండిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

నడకే నరకప్రాయం

- కోతకు గురైన రోడ్డు - నిషాని గ్రామస్థులకు కష్టాలు



కోతకు గురైన రోడ్డు

కెరమెరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు కోతకు గురికావడంతో మండలంలోని నిషాని గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం చుట్టూ కుమరం భీం ప్రాజెక్టు బ్యాక్ వాటర్, మరో వైపు దట్టమైన అటవీ ప్రాంతం ఉంటుంది. గ్రామం నుంచి కెరమెరికి వెళ్లే దారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురికావడంతో నడక నరక ప్రాయంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిషాని గ్రామానికి ఇందాపూర్ మీదుగా బీటీ రోడ్డు కొన్నేళ్ల క్రితం పూర్తయింది. కాగా దేవుడుపల్లి నుంచి నిషాని గ్రామం వరకు పూర్తి అటవీ ప్రాంతం కావడంతో అధికారులు పనులను నిలిపివేశారు. దీంతో దేవుడుపల్లి నుంచి నిషాని వరకు రెండు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో వాహనాలు నడవలేని పరిస్థితి నెలకొంది. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎకరానికి రూ.30 వేల పరిహారం చెల్లించాలి



దహెగాంలో పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

దహెగాం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎర్రవాగు, పెద్దవాగు వరదలతో నష్టపోయిన పంటలకు ఎకరానికి 30 వేల రూపాయల పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఖర్జి గ్రామంలో నష్టపోయిన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన పది వేల పరిహారం రైతులకు సరిపోదన్నారు. అనంతరం వర్షాలకు కోతకు గురైన రాంపూర్, ఖర్జీ-రాంపూర్, గిరివెల్లి- ఖర్జీ రోడ్లకు ఎక్స్‌కవేటర్లతో మరమ్మతులు చేపట్టారు. చిన్నరాస్పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 45 స్టీల్ బెంచీల ను భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సహకారంతో అందజేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తాన ని అన్నారు. ఆయన వెంట నాయకులు దామోదర్, ధనుంజయ్, సంజీవ్, దామోదర్, సోమశేఖర్, మల్లాగౌడ్, రాజన్న, వెంకన్న, బక్కన్న పాల్గొన్నారు.

విద్యార్థులు వందశాతం హాజరయ్యేలా చూడాలి

రెబ్బెన, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో వంద శాతం హాజరు ఉండేటట్టు ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సూచించారు. సోమవారం రెబ్బెన మండలం నెర్పల్లి గ్రామ పంచాయతీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టిక, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరుపై ప్రతీ రోజు పరిశీలించాలన్నారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. అలాగే విద్యార్థు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలను అందించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమాల్లో ఎంఈవో వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

పెంచికలపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి ఎస్సై అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో బాధితుడికి సోమవారం హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ అందజేశారు. మంచిర్యాలకు చెందిన షైదం రాజు అనే వ్యక్తి నెల రోజుల క్రితం పనుల నిమిత్తం పెంచికలపేట మండల కేంద్రానికి వచ్చిన సమయంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వివరాలు నమోదు చేసి ఫోన్‌ను గుర్తించి సోమవారం బాధితుడికి అందజేసినట్లు ఎస్సై అనీల్‌కుమార్ తెలిపారు. ఫోన్ పోగొట్టుకున్న వారు కంగారు పడవద్దని, సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

షీ టీం సేవలపై అవగాహన

సిర్పూర్(టి), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని వసతి గృహంలో సోమవారం షీ టీం ఇన్‌చార్జి ఏఎస్సై సునీత షీటీం సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు భద్రత, చట్టాలు, ఆపద సమయంలో ఎలా స్పందించాలనే విషయాన్ని వివరించారు. అలాగే డయల్ 100, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురైనట్లయితే వెంటనే షీ టీం నంబర్ 8712670564(ఆసిఫాబాద్), 8712670565 (కాగజ్‌నగర్)లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భాగ్యమ్మ, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు రమాదేవి, స్వప్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

ఆసిఫాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం జన్కాపూర్‌లో రామాలయంలో షెడ్డు నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే కోవలక్ష్మి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మర్సుకోల సరస్వతి, పీఏసీఎస్ చైర్మన్ అలీబిన్ అహ్మద్, అహ్మద్, నారాయణ, జగన్, భద్రయ్య, సురేందర్, సత్యనారాయణ, గిరిధర్, శైలేందర్, తిరుపతి, శ్రీశైలం, శివచందు, రవీందర్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

కాసిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీసుస్టేషన్ పరిధిలోని సోమగూడెం భరత్‌కాలనీకి చెందిన మల్లెపల్లి శోభన్(42) అనే ఆటో డ్రైవర్ కుటుంబకలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాసిపేట ఏఎస్ఐ రవీందర్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలం అన్నారం గ్రామానికి శోభన్ ఉపాధి నిమిత్తం సోమగూడెం భరత్‌కాలనీలో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటిలో దంపతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ గొడవతో భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన శోభన్ ఆదివారం ఇంట్లో పురుగులమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు శోభన్ తమ్ముడు మల్లెపల్లి తిరుపతి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కాసిపేట పోలీసులు తెలిపారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



కొట్టే బాపన్న(ఫైల్)

హాజీపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముల్కల్ల గ్రామానికి చెందిన కొట్టే బాపన్న(51) అనే వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హాజీపూర్ ఎస్ఐ స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కల్ల గ్రామానికి చెందిన బాపన్న సెంట్రింగ్ పనితో పాటు వ్యవసాయం చేసేవాడు. ఇటీవల నడుము నొప్పి ఎక్కువకావడంతో ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి బాపన్న కూలిపనులకు సరిగా వెళ్లడం లేదు. ఇల్లు గడవడం ఇబ్బందిగా ఉండడంతో మనస్తాపం చెంది ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి గ్రామ శివారులో నీలగిరి తోటలో గడ్డి మందు తాగి చనిపోయాడు. మృతుడు బాపన్న భార్య కొట్టే పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రిటైర్డ్ కార్మికుడి మృతి



నారాయణ (ఫైల్)

నస్పూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తీగల్‌పహాడ్ రాంనగర్‌లో దొరిశెట్టి నారాయణ (62) అనే రిటైర్డ్ కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై సోమవారం మృతి చెందాడు. నస్పూర్ ఎస్ఐ-2 జితేందర్ సింగ్ కథనం ప్రకారం.. నారాయణ సింగరేణిలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందాడు. ఇటీవల కొత్త ఇంటి నిర్మాణం చేపట్టాడు. సోమవారం ఉదయం కొత్త ఇంటి క్యూరింగ్ కోసం నీరు పట్టేందుకు బోరు వద్దకు వెళ్లాడు. బోరు స్టార్ట్ చేసే క్రమంలో ఒక్క సారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే పడిపోయాడు. సమయం దాటుతున్నా భర్త రాకపోవడంతో భార్య మల్లక్క, కూతురు సరిత కొత్త ఇంటికి వెళ్లి చూసే సరికి నారాయణ స్టార్టర్ కేబుల్‌ను పట్టుకుని కిందపడి ఉన్నాడు. గమనించిన భార్య మల్లక్క కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే నారాయణ చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడు నారాయణ భార్య మల్లక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ-2 జితేందర్ సింగ్ తెలిపారు.

మా బంగారం సంగతేంది..

- బ్యాంకు ఎదుట బాధితుల ఆందోళన
- ఇప్పుడే ఏం చెప్పలేమంటున్న అధికారులు



బ్యాంకులో అధికారులతో వాగ్వాదం చేస్తున్న బాధితులు

చెన్నూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎస్‌బీఐ బ్యాంకు 2 స్కామ్‌లో మోసపోయిన బాధితులంతా సోమవారం బ్యాంకు ఎదుట ఆందోళనకు దిగారు. సుమారు 450 మంది గోల్డ్ పెట్టి రుణాలు పొందగా బంగారం మాయం కావడంతో బాధితులు ఆందోళన చేపట్టారు. తమ బంగారం తమకు కావాలని, లోన్ మాఫీ చేసి బంగారం అందించాలని డిమాండ్ చేశారు. తాము ఎలాగైతే బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టామో అలాగే అందించాలని నినాదాలు చేశారు. సుమారు గంట పాటు ఆందోళన చేసిన బాధితులు ఒక దశలో బ్యాంకులోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అక్కడకు చేరుకుని గొడవ తీవ్రతరం కాకుండా బందోబస్తు చేపట్టారు. ఈ క్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజర్ రితీష్‌కుమార్ గుప్తా బాధితులతో మాట్లాడారు. బాధితులకు న్యాయం చేస్తామని, కానీ ఎప్పుడు చేస్తాం, ఎలా చేస్తామని ఇప్పుడే చెప్పలేమన్నారు. అసలు సూత్రదారి దొరికిన తర్వాత రికవరీ అయితే అందిస్తామని, పైగా దీనిపై విచారణ కొనసాగుతోందని, నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, బ్యాంకు నిబంధనలకు అనుగుణంగానే బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది. దాదాపు 200 మంది బాధితులు మహిళలు సైతం పాల్గొన్నారు. మోసపోయిన బ్యాంకుపై ఖాతాదారులంతా వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు. దీనికి ఎస్‌బీఐ విట్‌టీం అని పేరు పెట్టారు. దీంతో రోజు జరిగే ఆందోళనలపై ఆ గ్రూపులో పోస్టులు పెడుతున్నారు.

న్యూస్ బాక్స్

యూరియా కోసం రైతుల పాట్లు

చింతలమానేపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలం యూరియా కొతర తీవ్రం కావడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో రైతులు యూరియా కోసం బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. రవీంద్రనగర్-1 గ్రామంలో యూరియా బస్తాలు పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో రైతులు భారీగా అక్కడికి వచ్చి యూరియా కావాలంటూ గుమిగూడారు. అయితే మొదట టోకెన్ రాసుకున్న రైతులకు మాత్రమే యూరియా పంపిణీ చేస్తుండడంపై రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ గతంలో ఎన్నడు లేనివిధంగా యూరియాను కృత్రిమ కొరత సృష్టించి కొందరు దళారులు అక్రమంగా, అధిక ధరలకు విక్రయిస్తున్నా రని రైతులు ఆరోపించారు. సంబంధిత శాఖాధికారులు, ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి పట్టింపు లేని కారణంగానే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని రైతులు పేర్కొన్నారు. ఈ ఘటనపై వ్యవసాయాధికారులను సంప్రదించగా స్పందించ లేదు. రవీంద్రనగర్-1 గ్రామంలో కాకుండా మండల వ్యాప్తంగా ఉన్న రైతులకు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో యూరియా అంద లేదు. యూరియాను త్వరగా తెప్పించి అందజేయాలని పలువురు రైతులు తెలిపారు.

'వేతనాలు రాక ఇబ్బందులు'

బెజ్జూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అయిదు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని సీఆర్టీలు అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లడుతూ వేతనాలు నెల నెల విడుదల కాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల కోసం అధికారుల చుట్టు తిరుగుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరారు.

కార్మికుల హక్కుల కోసం త్యాగాలకైనా సిద్ధం



మందమర్రిలో పోస్టర్లను విడుదల చేస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

మందమర్రిటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం తమ యూనియన్ ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక హెచ్ఎంఎస్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ కార్మికులకు ఒరగబెట్టిందేమి లేదన్నారు. ఈ రెండు సంఘాలు అనుసరిస్తున్న విధానాలను కార్మికులు గమనిస్తున్నారని తెలిపారు. గుర్తింపు సంఘం ఎన్నికల ముందు ఈ రెండు సంఘాలు మారు పేర్లు మార్పు చేయిస్తామని, సొంతింటి కల నెరవేరు స్తామని, ఇన్‌కంటాక్స్ యాజమాన్యమే చెల్లించేలా ఒత్తిడి చేస్తామని అనేక హామీలు ఇచ్చాయన్నారు. తిరిగి ఇదే డిమాండ్లపై ఈ రెండు సంఘాలు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే సింగరేణి వ్యాప్తంగా సమస్యల పరిష్కారం కోసం బాయిబాట కార్యక్రమం హెచ్ఎంఎస్ చేపట్టిందన్నారు. తమ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ నేతృత్వంలో పోరాటాలు చేస్తామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ కృషి చేస్తోందన్నారు. సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల పిల్లలకు సంబంధించి ఉద్యోగాలు విజిలెన్స్‌పేరుతో నిలిపి వేశారని, వెంటనే వీరికి ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఈనెల 30,31న యూనియన్ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభల్లో కార్మికుల సంక్షేమానికి పలు తీర్మానాలను ప్రవేశపెట్టడం జరుగు తుందన్నారు. అనంతరం సభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెల్ది సుదర్శన్, రాజేష్, చొప్పరి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: ఈనెల 30, 31 తేదీల్లో శ్రీరాంపూర్‌లో జరిగే హెచ్ఎంఎస్ రాష్ట్ర 26వ మహాసభల పోస్టర్లను గోలేటిలోని సీహెచ్‌పీలో సోమవారం హెచ్ఎంఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ పతెం రాజబాబు మాట్లాడుతూ కార్మికుల ఆత్మ గౌరవం కోసం, కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడిది కేవలం హెచ్ఎంస్ సంఘమన్నారు. కార్యక్రమంలో నాయకులు దత్తు, దీపక్‌రాజ్, రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం



ఉద్యోగికి మట్టి గణపతిని అందిస్తున్న డైరెక్టర్

శ్రీరాంపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక ప్రతిమలతోనే పూజలు చేద్దామని, పర్యావరణాన్ని కాపాడుకుందామని సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు పిలుపునిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సోమవారం ఆయన మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి సంస్థ పర్యావరణహిత మైనింగ్‌కు మారుపేరుగా నిలుస్తోందన్నారు. ఉద్యోగులు సైతం అదేబాటలో నడవాలని పూజల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక ప్రతిమలు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో జీఎం(మార్కెటింగ్) టి శ్రీనివాస్, సింగరేణి భవన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

జైపూర్ (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో మట్టి వినాయక ప్రతిమలను సోమవారం ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు ఉద్యోగులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వినాయక చవితి ముఖ్య పండగ అని, దీన్ని పర్యావరణహితంగా జరుపుకోవాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేయబడిన వినాయక విగ్రహాల వల్ల జలకాలుష్యంతో జలచరాలు నశించి వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అందరు మట్టి విగ్రహాలను పూజించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు నర్సింహారావు, సత్యనారాయణ, శ్రీనివాస్, మురళీధర్, మదన్‌మోహన్, శ్రీనివాస్, శివ ప్రతాప్, కిరణ్‌బాబు, వాసుదేవమూర్తి, చంద్రమణి పాల్గొన్నారు.

నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కె వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించి అధికారులు, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. క్వారీలోని కోల్ బెంచ్‌ను, ఆఫ్ లోడింగ్ ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, ఉత్పత్తి పెంపుదల కోసం కృషి చేయాలన్నారు. ఓబీ కాంట్రాక్ట్ కంపెనీలు తప్పనిసరిగా తమకు కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడంలో ముందుండాలని ఆదేశించారు. క్వారీలో నీరు నిల్వకుండా పంపుల ద్వారా ఎప్పటికప్పుడు పైకి పంపించాలని అన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీల పీవోలు వెంకటేశ్వర్లు, ఏవీ రెడ్డి, మేనేజర్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, ఏరియా క్వాలిటీ ఇన్‌చార్జి కె. వెంకటేశ్వర్‌రెడ్డి, రక్షణాధికారి శ్రీధర్, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

కార్మికుల కోసం నిస్వార్థంగా పనిచేయాలి



తిరుపతికి ఐఎన్‌టీయూసీ కండువా కప్పుతున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కార్మికుల కోసం నిస్వార్థంగా పనిచేయాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్ సూచించారు. ఇందారం 1ఏ గనిలో ఎస్‌డీఎల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న బి తిరుపతిని శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌డీఎల్ కార్మికుల ఇన్‌చార్జిగా, ఎస్ఆర్‌పీ-1లో ఓవర్‌మెన్‌గా పనిచేస్తున్న చల్ల చంద్రశేఖర్‌ను శ్రీరాంపూర్ ఏరియా మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జిగా నియమిస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, బి తిరుపతి ఏఐటీయూసీలో 16 ఏళ్లుగా పనిచేస్తున్నా, ఆయనకు అక్కడ తగిన ప్రాధాన్యం లభించలేదన్నారు. ఆ యూనియన్ విధానాలు కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని, అందుకే ఐఎన్‌టీయూసీలో చేరినట్లు చెప్పారు. కార్మికుల శ్రేయస్సే ధ్యేయంగా నాయకులు నిస్వార్థంగా పనిచేయాలని సూచించారు. కార్మికులకు లాభాల వాటా, ఇతర ప్రయోజనాలు అందించేందుకు సింగరేణి యాజమాన్యంతో పాటు ప్రభుత్వస్థాయిలో తాము ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు.

క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పించాలి

రెబ్బెన, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియా పోటీల్లో మెడల్స్ సాధించిన క్రీడాకారులకు ప్రాధాన్యత కల్పించాలని సోమవారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గత సంవత్సరం కార్పొరేట్ గైడ్‌లైన్స్ విస్మరించి, కోల్ ఇండియా స్థాయిలో ప్రతిభ చూపని కొందరికి కమిటీలో స్థానాలు కల్పించినట్టు తెలిపారు. దీంతో అసలైన క్రీడాకారులు నిరుత్సాహ పడుతున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా కోల్ ఇండియా పోటీల్లో మెడల్స్ సాధించిన వారికి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్, కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరి సెంగం ప్రకాష్ రావు, జాయింట్ సెక్రటరి మిట్టపల్లి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నెన్నెల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. జులై నెల జీతం ఇంతవరకు రాలేదన్నారు. ఫిక్స్‌డ్ వేతనం రూ. 18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఆందోళనలు చేస్తే రూ. 50 లక్షల బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు, టార్గెట్స్ రద్దు చేసి ప్రమోషన్లు ఇస్తామని హామి ఇచ్చినా నెరవేర్చలేదన్నారు.

జన్నారం: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రాంప్రసాద్ జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదుల విభాగంలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కళాశాలలో మరుగు దొడ్ల నిర్వహణతో పాటు సమస్యలతో విద్యార్థులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

జన్నారం: ఆర్ కిష్టయ్య చేపట్టిన దీక్షకు మద్దతుగా చేపట్టిన బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం రిలేనిరహార దీక్షలు చేపట్టారు. ఆ సంఘం మండల నాయకులు నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్‌కార్మికుడు దేవి ప్రభాకర్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడని తెలుసుకొని గల్ఫ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 22,600 నగదును బాధిత కుటుంబానికి అందజేయగా మరికొంత మంది గల్ఫ్‌కార్మికులు మరో రూ.16,600 అందజేసినట్లు గల్ఫ్‌కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు భూమయ్య తెలిపారు.

వేమనపల్లి : సుంపుటం గ్రామంలో సోమవారం వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. సూపర్ వైజర్ అపరంజి, హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, ఏఎన్ఎంలు మంజుల, రాజ్యలక్ష్మీ, ఆశా కార్యకర్త శారద పాల్గొన్నారు.

తాండూర్ : తాండూర్ మండల కేంద్రంలోని భగత్‌సింగర్ భవన్‌లో సోమవారం సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డికి సీపీఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి కొండు బానేష్, నాయకులు మొగిలి, నాగరాజు, శంకర్, పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లి మండలం అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ఉత్తరా నక్షత్రం సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం చేసారు.

మంచిర్యాల కలెక్టరేట్ : హెచ్ఐవీ , ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని హెచ్ఐవీ కో ఆర్డినేటర్ నీలిమ, వైద్యులు శివ ప్రతాప్, ఫాతిమాలు పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాలలోని జిల్లా పరిషత్ పాఠశాలలో, కార్మెల్ పాఠశాలల్లో సోమవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమంలో భాగంగా 2 కే రన్ నిర్వహించి సర్టిఫికెట్లు అందించారు.

● మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడిగా రంగ శ్రీశైలం, నస్పూర్ డివిజన్ అధ్యక్షుడిగా కుర్రె చక్రవర్తిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

వంతెన నిర్మాణానికి మోక్షం

- ఎమ్మెల్యే ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు
- లో లెవల్ వంతెన స్థానంలో హై లెవల్ బ్రిడ్జి
- నెరవేరనున్న 12 గ్రామాల ప్రజల చిరకాల వాంఛ
- క్వారీ రోడ్డులో వర్షాకాలంలో తొలగనున్న ఇబ్బందులు



ఇరుకు వంతెన పై నుంచి వెళ్తున్న వాహనాలు (ఫైల్)

మంచిర్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన జిల్లా కేంద్రంలోని ఎంసీసీ క్వారీ రోడ్డులో గల లో లెవల్ వంతెనకు ఎట్టకేలకు మోక్షం లభించినట్లయింది. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు క్వారీ రోడ్డులోని కల్వర్టుపై హై లెవల్ వంతెన నిర్మించనున్నట్లు సోమవారం ఆయన నివాసంలో ప్రకటించారు. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితుల్లో లో లెవల్ వంతెనపై నుంచి ప్రతియేటా వర్షాకాలంలో 12 గ్రామాలకు చెందిన ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించేవారు. దశాబ్దాల క్రితం నిర్మించిన లో లెవల్ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరి, కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అయినా వాటి స్థానంలో నూతన వంతెనను నిర్మించాలనే ఆలోచన సంబంధిత అధికారులతోపాటు గత పాలకులకు రాకపోవడంతో ఇంత కాలం ప్రజలకు శాపంగా పరిణమించింది.

ప్రమాదకర స్థితిలో...

జిల్లా కేంద్రంలోని క్వారీ రోడ్డులో గల లో లెవల్ బ్రిడ్జి ప్రస్తుతం అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంది. దాదాపు 60 ఏళ్ల క్రితం అప్పటి అసోసియేటెడ్ సిమెంట్ కంపెనీ (ఏసీసీ) తన ఉత్పత్తి అవసరాల కోసం ప్రస్తుత డీ మార్ట్ సమీపంలో నాలాపై లో లెవల్ వంతెన నిర్మించింది. పట్టణం నుంచి క్వారీ గుట్ట ప్రాంతానికి వెళ్లేందుకు వంతెన ఉపయోగపడేది. కేవలం ఏసీసీ అవ సరాలకే కాకుండా క్వారీ గుట్టల అవతల ఉన్న దాదాపు 12 గ్రామాల ప్రజలు రాకపోకలు ఆ వంతెన పైనుంచే సాగించేవారు. హాజీపూర్ మండలంలోని నాగారం, గడ్‌పూర్, చిన్నగోపాల్‌పూర్, ర్యాలీ గ్రామ పంచాయతీల పరిధిలోని బాబానగర్, కొత్తగూడెం, నాగారం, దుబ్బ గూడెం, పెదగోపాల్‌పూర్, మర్రి గూడెం, గోండు గూడెం, కొలాంగూడ గ్రామాల ప్రజలకు ప్రస్తుతం క్వారీ రోడ్డులోని లో లెవల్ వంతెన ప్రధాన ఆధారంగా మారింది. ఆయా గ్రామాల పరిధిలో సుమారు ఐదు వేల మంది జనాభా ఉండగా ప్రతి చిన్న పనికీ జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు.

కూలీ పనులు చేసుకునే వారు, విద్యార్థులు, ఆసుపత్రులకు వెళ్లాలంటే తప్పనిసరిగా లో లెవల్ వంతెన దాటాల్సిందే. వంతెన నిర్మించిన నాలా సైతం కాలక్రమంలో చిన్నపాటి వాగులా రూపాంతరం చెందడంతో ముఖ్యంగా వర్షాకాలంలో ఉప్పొంగి ప్రవహిస్తుంటోంది. నాలా ఉప్పొంగినప్పుడల్లా లో లెవల్ వంతెన నీట మునిగి దాదాపు నాలుగైదు గంటల పాటు ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోతుంటాయి. పాఠశాలల బస్సులు ఎక్కడివక్కడే నిలిచిపోయి గంటల తరబడి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తే ప్రాణాలు వదిలేయాల్సిందేగానీ, అక్కడి ప్రజలకు మరో మార్గం ఉండదు.

జిల్లా కేంద్రంలోని అండాళమ్మ కాలనీ మీదుగా రాళ్ల వాగుపై కాజువే వంతెన ఉన్నప్పటికీ వర్షాకాలంలో వాగు ఉప్పొంగినప్పుడల్లా అది నీట మునుగుతోంది. దీంతో రాక పోకలు సాగించేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. క్వారీ రోడ్డులోని నాలా ప్రవాహానికి గతంలో ఏసీసీ (ప్రస్తుత ఎంసీసీ కంపెనీ) ప్లాంట్‌కు చెందిన ఓ ఫోర్‌మన్ గల్లం తుకాగా మరునాడు అతని మృత దేహం లభ్యమైంది. ప్రస్తుతం వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరడ మేగాక ఇరుకుగా ఉండటంతో ఒక వాహనం వెళ్లేంత వరకు ఇతర వాహనాలు ఎక్కడి కక్కడే నిలిపి ఉంచాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. లో లెవల్ వంతెన స్థానంలో హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలంటూ 12 గ్రామాల ప్రజలు అనేకసార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది.

ఫోర్‌లేన్ రోడ్డుకు అనుసంధానంగా...

క్వారీ రోడ్డులోని లోలెవల్ వంతెన స్థానంలో హై లెవల్ బ్రిడ్జి నిర్మించడంతోపాటు ఏసీసీ చౌరస్తా వద్ద నుంచి సాగిపోయే ఫోర్‌లేన్ నేషనల్ హైవేకు అనుసంధానం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. బ్రిడ్జితోపాటు సంబంధిత రోడ్డును ఫోర్‌లేన్‌గా మారుస్తూ ముల్కల్ల నుంచి వచ్చే మరో ఫోర్‌లేన్ జగిత్యాల- మంచిర్యాల జాతీయ రహదారికి కలపనున్నారు. క్వారీ రోడ్డులో వంతెన నిర్మాణం, రహదారి వెడల్పు పనుల కారణంగా 12 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటమే గాక బెల్లంపల్లి వైపు నుంచి లక్షెట్టిపేటకు వెళ్లే వాహన చోదకులకు సైతం ప్రయాణం సులభతరం అయ్యే అవకాశాలు ఉన్నాయి. వంతెన నిర్మాణం ఆవశ్యకతను ప్రస్తావిస్తూ 2023 జనవరి 6న 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో 'వంతెనల నిర్మాణ మెప్పుడు..?' శీర్షికన కథనం ప్రచురితమైంది. ప్రస్తుతం ఆ కళ నెరవేరనుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చూపు సన్నగిల్లుతోంది..

(5వ పేజీ తరువాయి)

కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఆసిఫాబాద్ కొమురం భీం జిల్లాలో 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 28,467 మందికి కంటి పరీక్షలు నిర్వ హించగా 30 మంది కంటి సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. వీరికి అవసరం మేరకు కంటి అద్దాలు ఇచ్చి ఆపరేషన్లు చేయించారు.

● సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోవడమే...

కోవిడ్ సమయంలో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించారు. దీంతో చిన్నారుల్లో సెల్‌ఫోన్ వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. ప్రస్తుతం పాఠశాలల నుంచి ఇండ్లకు చేరిన తరువాత పిల్లలు వీడియో గేమ్స్, సినిమాలు, తదితరాలకు సెల్‌ఫోన్‌లు వినియోగిస్తున్నారు. ఎక్కువ సమయం స్ర్కీన్ చూడడంతో దృష్టిలోపం వస్తున్నట్లు వైద్యులు గుర్తించారు. కొందరికి తల్లిదండ్రు లే గంటల తరబడి సెల్‌ఫోన్ ఇవ్వడం దృష్టి లోపానికి ప్రధాన కారణాలని నిపుణులు చెబుతున్నారు.

● దృష్టిలోపానికి కారణాలు...

పిల్లల్లో విటమిన్ ఏ లోపంతో రేచికటి, గ్లూకోమా వంటి కంటి సమస్యలు వస్తున్నాయి. పోషకాహార లోపంతో ఏ విటమిన్ లోపిస్తుంది. కొందరికి పుట్టుకతోనే సమస్యలు వస్తున్నాయి. వీటికి జన్యుపరమైన కారణాలు, మేనరికం పెండ్లీలు, గర్భంతో ఉన్నప్పుడు తల్లి తీసుకునే ఆహారం, మెడిసిన్‌కు కారణమవుతుంది.

● ఈ జాగ్రత్తలు తీసుకోవాలి...

కళ్లను రోజు చల్లని మంచినీటితో కడగాలి. కంటికి సురుమ కాటిక వంటివి వాడకపోవడమే మంచిది. దుమ్ము, పొగ ప్రకాశవంతమైన క్రాంతివైపు కళ్లను నేరుగా తెరిచి చూడరాదు. చదవే సమయంలోసెల్‌ఫోన్ చూస్తున్నప్పుడు ప్రతి పదిహేను నిమిషాలకు ఒక సారి కండ్లను విధిగా విరామం ఇవ్వాలి. దృష్టిలోపం ఉంటే కళ్ల జోడు వాడడం తప్పనిసరి.

వైభవంగా శాంతి హోమం

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీగ ణపతి ఓంకారేశ్వర స్వామిదేవాలయంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శాంతి హోమం, మృత్యుంజయ హోమం నిర్వహించారు. వినాయక చవితిని పురస్కరించుకుని మండపాల నిర్వహకులకు, భక్తులకు ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వహించేందుకు శాంతి హోమం నిర్వహించినట్లు సమితి సభ్యులు తెలిపారు. అలాగే మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆరోగ్యం త్వరగా కోలుకో వాలని మృత్యుంజయ హోమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రవీందర్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, వెంకటేష్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తూములనరేష్, బ్లాక్ అధ్యక్షుడు తిరుపతి, శంకర్, మల్లికార్జున్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, నారాయణ, బోస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

బెల్లంపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంతో పాము మండలంలో అర్హులైనవారందరికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరుతూ సోమవారం ఆర్డీవో కార్యాలయంలో సబ్‌కలెక్టర్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో 34వార్డులు ఉన్నాయని ఇందులో కొంత మందికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినప్పటికీ ఇంటి నిర్మాణాలు చేపడుతున్న సమయంలో ప్రభుత్వ భూమి అని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పట్టణంలో అర్హులైన వారు ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలాలు కేటాయిస్తూ ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కళ్యాణి, నాయకులు సంతోష్, రాములు, గౌస్‌బాబా పాల్గొన్నారు.

బోధనోపకరణాలతో ఆసక్తి పెరుగుతుంది

కాసిపేట, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు తరగతి గదిలో బోధనోపకరణాలతో బోధిస్తే విద్యార్థుల్లో అభ్యాసన పట్ల ఆసక్తి పెరుగుతుందని డీఈవో యాదయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాసిపేట ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బోధనోపకరణాల మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తరగతి గదుల్లో తోటి ఉపాధ్యాయులు బోధనోపకరణాలతో పాటాలు బోధించడం వల్ల విద్యార్థుల్లో అభ్యాసన పట్ల ఆసక్తి పెరిగి విద్యా ప్రమాణాలు ఎంతో మెరుగుపడతాయన్నారు. విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మేళాకు మండలంలోని అన్ని పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు తమ సృజనాత్మకతను ప్రతిబింబించే విధంగా బోధనోపకరణాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయుల సృజనాత్మకతను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు చౌదరి, సత్యనారాయణ మూర్తి, విజయలక్ష్మీ, కాసిపేట ఎంఈవో వెంకటేశ్వరస్వామి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సాంబమూర్తి, రమేశ్‌రాథోడ్, ఎల్, సుధాకర్‌లు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజించాలి



సిబ్బందికి మట్టి వినాయకులను అందిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలన్నారు. నీటి కాలుష్యాన్ని నివారించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో యారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని, నీటి కాలుష్యం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

అక్రమ పట్టాలు రద్దు చేయాలి

బెల్లంపల్లి, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్వాన్ గ్రామ శివారులో సర్వే నెంబర్ 8లో ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా పట్టా చేయించుకున్నారని పట్టాను రద్దు చేయాలని కోరుతూ సోమవారం సబ్‌కలెక్టర్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. అక్రమ పట్టాపై రెవెన్యూ అధికారులతో విచారణ చేయించి పట్టాలు రద్దు చేయాలని సబ్‌కలెక్టర్‌కు సూచించారు. గతంలో రెవెన్యూ అధికారులు అక్రమంగా పట్టా చేశారని పూర్తి స్థాయిలో విచారణ జరుపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవు

బెల్లంపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడడం నేరంగా పరిగణించబడుతుందన్నారు. ఎవరైన ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్న పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

మందమర్రిరూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఆదిల్‌పేట గ్రామంలో రైతులకు జీవామృతం తయారీపై రైతులకు ఏఈవో ముత్యం తిరుపతి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి రసాయనాలు లేకుండా జీవామృతం తయారు చేసుకోవచ్చని, దీని వల్ల రైతులు అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

హాజీపూర్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపేంట గ్రామంలోని పద్మశాలివాడలో చేతిపంపు చెడిపోవడంతో కాలనీవాసులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. రెండు నెలల క్రితం చేతి పంపు చెడిపోవడంతో అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని ఆవే దన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి చెడిపోయిన బోర్‌వెల్‌ను రిపేర్ చేయించి సమస్యలు తీర్చాలని వేడుకుంటున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

తాండూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం మండల తహసీల్దార్, ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయ డంలో విఫలమైందని, ప్రజలను మోసం చేస్తుందన్నారు. అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, నర్సాపూర్ పంచాయతీకి వెళ్లే దారిలో భీమన్న వాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలని, పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు, నాయకులు పాల్గొన్నారు.

'లెదర్ పార్కును ప్రారంభించండి'..



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మందమర్రిరూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : లెదర్ పార్కును ప్రారంభించాలని కోరుతూ సోమవారం బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు సప్పిడి నరేష్, మండల అధ్యక్షుడు గిర్నాటి జనార్ధన్‌లు మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం ప్రారంభించిన లెదర్ పార్కు ఇప్పటికి అసంపూర్తిగా ఉందని, దీనికి నిధులు కేటాయించి ప్రారంభించాలన్నారు. అలాగే మందమర్రి మున్సిపాలిటీలో సొంత ఇల్లు కట్టుకున్న వారికి ఇళ్ల పట్టాలు అందించాలని, శంకర్‌పల్లిలో పాం ఆయిల్ ఫ్యాక్టరీని నిర్మించాలని డిమాండ్ చేశారు. వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. నాయకులు పోశం, డీపీ దీక్షితులు, సంజీవరావు, రాజమల్లు, మోహన్, వినయ్, ప్రియాంక, రజిత పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

దండేపల్లి ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి మండలం వెల్గనూర్ చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త అక్కల సత్తయ్య స్మారకార్థం సోమవారం గ్రామంలోని కరీంనగర్ చెందిన ఆయుష్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 50మంది యువకులు పాల్గొన్నారు. ముందుగా వారి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నాయకులు పరామర్శించి, రూ. 5వేల నగదు అందజేశారు.

● మండలంలోని మేదరిపేట చెందిన ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ జడ్పీ వైస్ చైర్మపర్సన్, ప్రముఖ వైద్యురాలు మర్రి ప్రవీణరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావులు ప్రవీణరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అక్కల రవిందర్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ రేణి శ్రీనివాస్ ఉన్నారు

మానవ శరీరంపై అవగాహన అవసరం



అవయవాలపై ప్రత్యేకంగా ధరించిన డ్రెస్‌తో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

మందమర్రిటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కేకే5 ఫిల్టర్ బెడ్ పాఠశాలలో సోమవారం 5వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు భీంపుత్ర శ్రీనివాస్ మానవ శరీరం, అంతర్గత అవయవాలపై అవగాహన కల్పించారు. మానవ శరీరంలోని అవయాలకు సంబంధించి ప్రత్యేకంగా తయారు చేసిన డ్రెస్‌వేసుకుని ఉపాధ్యాయులకు అర్థమయ్యేలా బోధించారు. ప్రతి అవయవం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశంలోని పాఠాలు అర్థమయ్యే రీతిలో బోధన అందించడం ద్వారా వారిలో మేధాశక్తి పెరుగుతుందన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన చేస్తున్నామన్నారు. గతకొన్ని సంవత్సరాలుగా పాఠ్యాంశాలకు అనుగుణంగా దుస్తులు ప్రత్యేకంగా చేయించి బోధిస్తున్నానన్నారు. తాను ప్రత్యేకంగా తయారు చేసిన దుస్తుల ద్వారా బోధన చేయడంతో బోధన ఉపకరణాల విభాగంలో ఆజాదీ అమృత ఉత్సవాల్లో మన రాష్ట్రం నుంచి తనను పోటీ పడేలా చేశాయని చెప్పారు. పాఠశాలల్లో శ్రీనివాస్ బోధిస్తున్న విధానానికి తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

గంజాయి కేసులో ఒకరు అరెస్టు

మంచిర్యాలక్రైం, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం జాఫర్‌నగర్‌లో గుడెల్లి సాయికుమార్ వద్ద 250 గ్రాముల గంజాయిని స్వాధీన పరుచుకున్నట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సాయికుమార్ బల్లార్షా నుంచి గంజాయిని తీసుకొని వస్తుండగా ఎస్ఐ తిరుపతి సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డాడన్నారు. సాయి కుమార్‌ను అదుపులోకి కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

రిజర్వేషన్‌లు ప్రకటించి ఎన్నికలు నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు ప్రకటించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి గాజుల ముకేష్‌గౌడ్ అన్నారు. సోమవారం హైద్రాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య నేతృత్వం లో జరిగిన ధర్నాలో మంచిర్యాల జిల్లాకు చెందిన బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు. ముకేష్‌గౌడ్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటిస్తేనే న్యాయం జరుగుతుందన్నారు.

రిజర్వేషన్‌లకు రాజకీయ చర్యలు అంటకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాస్, రాజు, విజయ్, ప్రకాష్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపులో ఉద్రిక్తం

జేసీబీని అడ్డుకొన్న ఇంటి నిర్మాణ దారులు ● రోడ్డుపై బైఠాయించి నిరసన



సోమగూడెం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఇంటి నిర్మాణదారులు

కాసిపేట, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా భూమిని ఆక్రమించి చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను కూల్చేయాలని కోర్టు ఆదేశాలు ఇవ్వడంతో బెల్లంపల్లి మండలం ఆకనపల్లి శివారు ప్రాంతంలో సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బెల్లంపల్లి మండలం ఆకనపల్లి శివారు ప్రాంతంలో 2.75 ఎకరాల భూమిలో 13 మంది ఆక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీనిని సవాలు చేస్తూ భూ యజమాని ఊరుమందర్రికి చెందిన రామ్‌కిష్టయ్య 30 ఏళ్ల క్రితం కోర్టును ఆశ్రయించారు. దీంతో మూడు రోజుల క్రితం బెల్లంపల్లి సివిల్ జడ్జి తీర్పునిస్తూ అన ధికారికంగా భూమిని ఆక్రమించారని నిర్ధారిస్తూ మూడు రోజులలోపు స్వచ్ఛందంగా ఇళ్లను ఖాళీ చేయాలని కోరుతూ 13 మందికి నోటీసులు అందజేసింది. కానీ కోర్టు ఆదే శాలను పాటించకుండా ఇళ్లను ఖాళీ చేయకపోవడంతో సోమవారం అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్, పోలీసు, రెవెన్యూ, పంచాయతీ, విద్యుత్‌శాఖ అధికారులు జేసీబీ సాయంతో సోమగూడెం వద్దకు చేరుకు న్నారు. దీంతో ఇంటి నిర్మాణ దారులు జేసీబీని అడ్డుకొని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కాసేపు ఇక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇంటి నిర్మాణ దారులు మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం భూమిని కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలను చేసుకున్నామని ఇప్పుడు ఎక్కడికి పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. యజమాని రామకిష్టయ్య మాట్లాడుతూ తన భూమి తనకు ఇచ్చి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఇంటి నిర్మాణ దారులు తమకు కొంత గడువు కావాలని అధికారులను కోరడంతో అందుకు అధికారులు అనుమతించారు.

డ్రైనేజీలు నిర్మించండి

మందమర్రిరూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అందుగు లపేట గ్రామంలో డ్రైనేజీలు, కాలువలు నిర్మించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవో రాజేశ్వర్‌కు దరఖాస్తు అందించారు. డ్రైనేజీలు లేకపోవడంతో నీరు ఇళ్లలోకి వస్తుందని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల ఆన్‌లైన్ నమోదు పరిశీలన

మందమర్రిరూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొక్కల గుట్ట గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ఆన్‌లైన్ నమోదును ఎంపీడీవో రాజేశ్వర్ సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు నిర్మాణాలను వేగవంతం చేయాలని, బిల్లులు దశల వారీగా బిల్లులు వస్తాయన్నారు. పంచాయతీ కార్యదర్శి విద్యాలత పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

దండేపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం రెబ్బన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సమకూర్చిన విద్యాసామగ్రిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు సోమవారం అందజేశారు. పాఠశాలలో చదువుతున్న సుమారు 50మంది నిరుపేద విద్యార్థులకు సామాగ్రి అందించారు. సంస్థ డైరెక్టర్ ఎండీ.శరీఫోద్దీన్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు





కలెక్టరేట్ ఎదుట రేషన్ డీలర్ల ధర్నా..

ధర్నా చేస్తున్న రేషన్ డీలర్లు

నస్పూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్లకు రావాల్సిన ఐదు నెలల కమీషన్‌ను విడుదల చేయాలని కోరుతూ జిల్లా చౌకధరల దుకాణాల డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాయకులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలుడిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్‌కు అందించారు. ఈ సందర్భంగా డీలర్లసంఘం జిల్లా అధ్యక్షుడు మోట పలుకుల సత్తయ్య మాట్లాడుతూ జిల్లాలో 420 రేషన్‌షాపులు ఉన్నాయన్నారు. ఏప్రిల్‌నుంచి ఆగస్టు వరకు ఐదుమాసాల కమీషన్ నిలిచిపోయిందన్నారు. ప్రతీనెల డీలర్ల కమీషన్‌ను వారివారీ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మ సత్యనారాయణరెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ సుదమల్ల కృష్ణ, నస్పూర్ మండల అధ్యక్షుడు సల్లం రవి కుమార్, మంచిర్యాల అధ్యక్షుడు బుర్ర మహేందర్ పాల్గొన్నారు.



నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

కదం తొక్కిన ఆశా వర్కర్లు..

నస్పూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేశారు. అంతకు ముందుగా ప్రధాన రహదారి వద్ద నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు వచ్చారు. ధర్నా అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల యూనియన్‌నాయకులు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పారితోషికాలను తగ్గించాలన్నా నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలన్నారు. కేంద్రం పెంచిన పారితోషికాలు యధావిధంగా రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. ఈ ధర్నాలో ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సోమిడి నమ్మక్క, సీఐటీయూ నాయకులు రంజిత్‌కుమార్, ప్రకాష్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేయాలి

- బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



దండేపల్లిలో రైతు సత్యాగ్రహ దీక్ష చేపడుతున్న బిజేపి శ్రేణులు

దండేపల్లి ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటి పథకాల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని, వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట నాయకులు రఘనాథ్ వెరబెల్లి అన్నారు. సోమవారం దండేపల్లిలో బీజేపి ఆధ్వర్యంలో దండేపల్లి బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వర కు ర్యాలీ చేపట్టి, తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు, ప్రజలతో క లిసి ధర్నా చేపట్టారు. అయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు గడుస్తున్న ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా మోసం చేస్తుందని మండిపడ్డారు. 2లక్షలపైగా ఉన్న రైతులకు పంట రుణమాఫీ వెంటనే చేయాలన్నారు. ఆయకట్టు చివరిపంటలకు సాగునీరు అందించాలన్నారు. ఉన్నత విద్యకు దండేపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డిమాండ్‌తో కూడిన విన్నతినతాన్ని దండేపల్లి తహసీల్దార్ రోహిత్‌దేశ్ పాండేకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్ష కార్యదర్శులు రవిగౌడ్, సంతోష్, అనిల్, గూడెం పీఏసీఎస్ ఛైర్మన్ సురేష్, నాయకులు వెంకటరమణరావు, కృష్ణమూర్తి, రాజన్న, ప్రభాకర్, కిషన్, తులసి, హరిగోపాల్ పాల్గొన్నారు.

నవరాత్రులను సామరస్యంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితిని పురస్కరించుకుని గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ప్రజలంతా సామరస్యంతో జరుపుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటు కోసం పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలని, అనుమతి ఉన్న మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. విద్యుత్ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దమండపాలను ఏర్పాటు చేయవద్దన్నా రు. విద్యుత్ సిబ్బందితో వైరింగ్ తనిఖీ చేయించుకోవాలని, ఇందుకు టోల్‌ఫ్రీ నెంబర్ 1912లో సంప్రదించాలన్నారు. అగ్ని ప్రమాదాలతో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమ జ్జనం రోజు అబ్కారీ మధ్య నిషేధ శాఖ ఆధ్వర్యంలో డ్రైడే నిర్వహించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యు లు, సిబ్బంది,అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. మున్సిపల్,పంచాయతీల ఆధ్వర్యంలో పారిశుద్య పనులను చేపట్టాలని, గోదావరి వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇందారం సమీపంలోని గోదావరి వంతెన వద్ద సింగరేణి ఆధ్వర్యంలో నిమజ్జనానికి లైట్లు, క్రేన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే సుమన్

జైపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలాల గ్రామానికి చెందిన బీజేపీ మండల ప్రధానకార్యదర్శి వేముల తిరుపతిగౌడ్, కాంగ్రెస్ పార్టీ రైతుసమితి కో ఆర్డినేటర్ సోదారిబాపు, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పదిమంది నాయకులు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా ఆయన పార్టీలో చేరిన వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. సుమన్ మాట్లాడుతూ కేసీఆర్ వల్లనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమన్నారు. పార్టీలో చేరినవారు పార్టీ బలోపే తానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చెన్నూరునియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు రాజారమేష్, మేడితిరుపతి, సాయికృష్ణ, గట్టయ్య పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితం అంధకారం చేసుకోవద్దు

- ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ అన్నారు. మంచిర్యాల మెడికల్ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సరదా పేరుతో ర్యాగింగ్‌లకు పాల్పడవద్దన్నారు. ర్యాగింగ్ చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాగింగ్ చేయడం వల్ల కేసులు నమోదై వారి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని సూచించారు. యాంటి ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని కమిటీలో కళాశాల యాజమాన్యంతో పాటు విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీ ఏర్పాటు చేయాలని ఏ చిన్న సమస్యతలెత్తిన యాజమాన్యానికి సమాచారం అందించాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినవారితో పాటు యాజమాన్యంపై కూడ చర్యలు తీసుకుంటామన్నారు. దీని కోసం యాజమాన్యం ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు ఉన్నతమైన స్థాయికి ఎదగాలంటే విద్యపై శ్రద్ధ చూపించాలన్నారు. కార్యక్రమంలో సీఐ ప్రమోద్ రావు, కళాశాల యాజమాన్యం, మెడికల్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

చెన్నూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ రేకుర్తిలోని డాక్టర్ బాస్కర్ మాదేకర్ ఉదార నేత్రవైద్యశాల సౌజన్యంతో చెన్నూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చెన్నూరు పట్టణంలోని పడమటింటి కృష్ణమూర్తి ఫంక్షన్‌హాలులో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు కంటి పరీక్షలుచేసి 48మందిని ఆపరేషన్‌ల కోసం రేకుర్తి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో చెన్నూరు సీఐ దేవేందర్‌రావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జాడి తిరుపతి, జోన్ చైర్‌పర్సన్ వెంకటేశ్వర్, ఎస్‌ఐ సుబ్బారావు, డాక్టర్‌లు జ్యోతి, కుడుషా, సభ్యులు సాగర్, నాగరాజుగౌడ్, కిష్టయ్య, సత్యనారా యణ, ప్రకాష్‌బాబు, శ్రీనివాస్, రాజబాబు, రవీంద ర్‌గౌడ్, ఆర్‌ఎంపీ డాక్టర్ స్వామి, ఆశా కార్యకర్త, సిబ్బంది పాల్గొన్నారు.

చూపు సన్నగిల్లుతోంది

- చిన్నారుల్లో పెరుగుతున్న కంటి సమస్యలు
- సెల్‌ఫోన్ ప్రభావం, పోషకాహార లోపమే ప్రధాన కారణం
- ఆర్‌బీఎస్‌కే పరీక్షల్లో వెలుగు చూస్తున్న వైనం
- అవసరమైన వారికి అద్దాలు, ఆపరేషన్లు
- జిల్లాలో 1143 మంది హైస్కూల్ విద్యార్థులకు కంటి సమస్యలు
- ఆందోళనలో తల్లిదండ్రులు



కాసిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు అల్లరి చేసినా.. అన్నం తినాలన్నా.. మారాం చేయకుండా సైలెంట్‌గా ఉండాలన్నా.. ఏదైనా పని చెబితే చేయాలన్నా పిల్లలకు తల్లిదండ్రులు అందిస్తున్న ఒకేఒక ఆయుధం సెల్‌ఫోన్. ప్రస్తుతం దీని ఫలితంగా చిన్న వయస్సులోనే పిల్లలు రకరకాల వ్యాధులను కొనితెచ్చుకుంటున్నారు. చీకట్లో, వెలుతురులో తదేకంగా సెల్‌ఫోన్ చూస్తుండడంతో బాల్యంలోనే కంటి సమస్యలతో బాధపడుతున్నారు. దీని వల్ల చిన్నతనంలోనే పిల్లలకు చూపు మసకబారుతోంది. గతంలో పాఠశాల, కళాశాల స్థాయిలో తరగతి గదుల్లో ఒకరిద్దరికి కంటి అద్దాలు ఉండేవి. కానీ ఇప్పుడు దాదాపు 80శాతం మంది పిల్లలు కంటి అద్దాలతో కనిపిస్తున్నారు. మూడేళ్లకే పాఠశాలలకు పంపించడం పోషకాహారం సరిగ్గా ఇవ్వకపోవడం వంశపారంపర్యంగా వచ్చే వ్యాధులు, తదితర కారణాలతో బాల్యం నుంచే చూపు మసక బారుతుందని వైద్యులు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం బాల్యం దశలోనే పిల్లల్లో అంధత్వ నివారణ చర్యలు చేపట్టాలన్నా ఆదేశాల మేరకు రాష్ట్రీయ బాల శాస్త్రీయ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా అంగన్‌వాడీ కేంద్ర ఆరేళ్లలోపు చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 4124 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,98,094మంది పిల్లలున్నారు. వీరిలో 1,24,279మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా 36మందికి కంటి అద్దాలు అవసరం కాగా 103మందికి ఆపరేషన్ల అవసరం పడింది. అలాగే జిల్లాలోని 684 హైస్కూళ్లలో 35,964 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. అందులో 1143 మందికి కంటిసమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు.

ఏయే పరీక్షలు చేస్తున్నారంటే...

పిల్లల్లో కంటి వ్యాధి గ్రస్తత కనురెప్ప కిందకి పడిపోవడం, కళ్లనుంచి నీరు రావడం కళ్లరెప్పలు నియంత్రించలేని స్థితుల్లో కదలడం, ఒకే దిశలో చూడక పోవడం, కంటిలో తేమ లేకపోవడం, కంటిపై ఒక వైపు మాంసం పెరగడం, కండ్లు పొడిబారడం, వక్రీభావన లోపాలు సరిగ్గా తెరవకపోవడం, కళ్లపై మచ్చలవంటి పరీక్షలు చేపట్టారు. కంటి పరీక్షల సందర్భంగా పిల్లల తల్లిదండ్రులకు పోషకాహారం తదితర అంశాలపై కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

ఆర్‌బీకేఎస్ ఆధ్వర్యంలో కంటి పరీక్షల నిర్వహణ...

మంచిర్యాల జిల్లాలో 969 కేంద్రాలు ఉండగా 37,185 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో పది మందికి..

(తరువాయి 7లో)

పిల్లల్లో ఫిజికల్ ఫిట్‌నెస్ తగ్గిపోతుంది...



ఈ కాలం పిల్లలకు ఫిజికల్ ఫిట్‌నెస్ తగ్గి రోగాల బారినపడుతున్నారు. పిల్లలకు సెల్‌ఫోన్‌కు బానిసలు కావద్దంటే ఇంట్లోనే అమ్మనాన్నలు వారితో కొంత సమయం కేటాయించి వాడుకోవాలి. మిగితా పిల్లలతో కలిసి స్కూల్లో కానీ, ఇంటి ఆవరణలో ఇండోర్‌గేమ్స్ ఆడే విధంగా పిల్లలకు సూచనలు చేయాలి. ముఖ్యంగా చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలి. పిల్లల పట్ల అమ్మనాన్నలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే సెల్‌ఫోన్ భారినపడడంతో పిల్లలు మానసిక రుగ్మత లకు గురవుతారు.

- ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మశ్రీ

అంధత్వాన్ని నివారించడమే లక్ష్యం...



పిల్లల్లో పెరుగుతున్న అంధత్వాన్ని నివారించేందుకు ప్రభుత్వం నుంచి తగిన చర్యలు చేపడుతున్నాం. టీవీ, సెల్‌ఫోన్ వినియోగం వల్ల కంటి సమస్యలపై అవగా హన సదస్సులు నిర్వహిస్తున్నాం. పేపర్, మీడియా ద్వారా ప్రచారాలు నిర్వహి స్తున్నాం. పిల్లల్లో ఏ విటమిన్ లోపం వల్ల కలిగే అంధత్వాన్ని నివారించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. కంటి పరీక్షల్లో గుర్తించిన వారికి కంటి అద్దాలతో పాటు ఆపరేషన్ చేపట్టాం. అంధత్వం లేని సమాజ నిర్మాణానికి అందరూ సహకరించా లి. అథత్వాన్ని నివారించడమే సంస్థ లక్ష్యం.

- డాక్టర్ సుధాకర్ నాయక్, అంధత్వ నివారణ సంస్థ (ఎన్‌పీసీబీ జిల్లా అధికారి మంచిర్యాల)

నియోజకవర్గాన్ని హైదరాబాద్ స్థాయిలో నిలబెడతా

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలక్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి హైదరాబాద్‌కు సరిసమానంగా నిలబెడతానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్‌లో లేనటువంటి 400 మెగావాట్ల సబ్ స్టేషన్, మంచిర్యాల 220 మెగావాట్ల సబ్‌స్టేషన్, లక్షెట్టిపేటలో 130 మెగావాట్ల సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు వచ్చాయన్నారు. అభి వృద్ధిపై చిత్తశుద్ధి ఉన్నది కాబట్టే తనపై కొందరు నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అభివృద్ధికి అడ్డుపడితే సహించేది లేదన్నారు. బతుకమ్మ కానుకగా మహిళలకు స్త్రీశక్తి భవనం నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. విద్యా, వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నామని దీని కోసం మంచిర్యాల బాలుర, బాలికల హైస్కూల్ భవనాలు తొలగించి నూతన భవనాలు నిర్మిస్తామన్నారు. జిల్లాకు త్వరలోనే నవోదయ హైస్కూల్ మంజూరవుతుందని తెలిపారు. హాజీపూర్ మండలంలోని ముల్కల్ల నిర్మిస్తున్న ఇండస్ట్రియల్ హబ్ ద్వారా 2వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వినాయక నవ రాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అందుకోసం ఉచిత విద్యుత్, మున్సిపాలిటి ద్వారా తాగునీరు, సానిటేషన్ వ్యవస్థను ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులకు కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తన ఆరోగ్యం కోసం పూజలు చేసిన ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, మహిళలకు, కార్యకర్తలకు అభిమానులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, నాయకులు పూదరి తిరుపతి, నరేశ్, పెంట రజిత, తాజా మాజీ నాయకులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు..



యూరియా కోసం క్యూలైన్‌లో ఉన్న రైతులు

కోటపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పారుపల్లి డీసీఎంఎస్ సెంటర్‌వద్ద సోమవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. కేవలం 400 బస్తాల యూరియా రాగా వెయ్యి మందికి పైగా రైతులు క్యూలో నిలబడ్డారు. ఓవైపు పురుషులు, మరోవైపు మహిళలు ఇలా రెండు లైన్లలో నిలబడ్డా కొందరికి ఒక బస్తా మాత్రమే ద క్కింది. మరికొందరికి ఒక్క బస్తా కూడా రాకపోవడంతో ఆవే దన వ్యక్తం చేస్తూ ఇంటిదారి పట్టారు. ఇదిలా ఉంటే ఈ పరిస్థితిపై బీజేపీ మండలఅధ్యక్షురాలు స్వప్న మాట్లాడుతూ యూరియా సరఫరా చేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని, వ్యవసాయ శాఖ మంత్రి రైతులకు సరి పడ యూరియా ఉందని, కొందరు రాజకీయం చేస్తున్నారని అన్నారని, మరి ఈ రోజు పారుపల్లి వద్ద పరిస్థితి చూస్తే దీన్ని ఏమంటారో మం త్రి తెలపాలని అన్నారు.

గోదావరి పరిరక్షణ కోసం పాదయాత్ర



పాదయాత్రలో మహారాష్ట్ర వాసులు

హాజీపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి పరిరక్షణకోసం మహా రాష్ట్రలోని గంగోత్రి ఆశ్రమం భక్తులు చేస్తున్న పాదయాత్ర సోమవారం మండలానికి చేరింది. పర్భని జిల్లా గంగాఖేడ్‌లోని గంగోత్రి ఆశ్రమానికి చెందిన పదిమంది భక్తులు గోదావరి పరిరక్షణ కోసం పాదయాత్ర చేపట్టారు. ఆగస్టు 3న గోదావరి పుట్టిన ప్రదేశమైన త్రయంబకేశ్వర్ నుంచి ఈ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. పూర్తిగా గోదావరి పరి వాహకంగా ప్రదక్షిణ చేస్తున్నట్లు మరో 25రోజుల్లో గోదావరినది సముద్రంలో కలిసే అంతర్వేదికి చేరుకోనున్నట్లు తెలిపారు. పది మంది భక్తులు, ముగ్గురు సహాయకులతో కూడిన ఈ బృందంరోజు 50 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తున్నారు. నవంబర్ 3వ తేదీలోపు తిరిగి తమ ఆశ్రమానికి చేరనున్నట్లు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులను అధికారులు త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్ర మంలో అందిన దరఖాస్తులను అధికారులు సమన్వయంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొ న్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావే శంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్జీదా రుల నుంచి దరఖాస్తులు స్వీకరిం చారు. మందమర్రి మండలం శేషు పల్లి గ్రామానికి చెందిన నక్క పవన్ కుమార్ తమ కుటుంబం కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని కొంతమంది ఆక్రమిం చుకుని తమను బెదిరిస్తున్నారని ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని దరఖాస్తు అందించాడు. తాండూర్ మండల కేంద్రానికి చెందిన పుప్పాల మహేష్ తనకు తెలంగాణ సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలో బీసీ కేటగిరి కింద సీటు ఇప్పించాలని కోరుతూ ఆర్జీ సమర్పించాడు. బెల్లంపల్లిపట్టణం బూడిదగడ్డ బస్తీకిచెందిన ఎనగందుల మౌనిక ఇందిరమ్మ ఇళ్ల అర్హుల సర్వేలో తనను అర్హురాలుగా ఎంపిక చేశారని, కానీ అర్హుల జాబి తాలో తనపేరు లేదని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందించింది.



ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

కరాటే పోటీల్లో ప్రతిభ

జైపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మంచిర్యాల జిల్లా కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి కరాటే టాలెంట్ పోటీల్లో జైపూర్ మండల విద్యార్థులు ప్రతిభ కనబర్చి మెడల్స్ గెల్చుకున్నట్లు కరాటే మాస్టర్‌లు నాగిరెడ్డి, సాయికిరణ్‌లు సోమవారం తెలిపారు. హిమాంశ సిల్వర్ మెడల్, లితిక్ష , ప్రకృతి,శివ, రిద్యాలు బ్రాంజ్ మెడల్స్ సాధిం చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ప్రతిభ కనబర్చడం అభినందనీయమని కరాటేపోటీల నిర్వహకులు పేర్కొన్నాట్లు తెలిపారు.